మేడారంలో పనులను పరిశీలిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి

## నాసిరకంగా మేడారం పనులు

- జాతర నిధులను దోపిడీ చేస్తున్న అధికారులు, కాంట్రాక్టర్లు
- ములుగు జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి

ములుగు, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : మేడారం అభివృద్ధి పనులు నాసిరకంగా జరుగుతున్నా మంత్రి సీతక్క పట్టించుకోకుండా అధికారులు, కాంట్రాక్టర్లకు కొమ్ముకాస్తున్నారని ములుగు జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి మండిపడ్డారు. బుధవారం ఆమె స్థానిక నాయకులతో కలిసి జాతర అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీతక్క నాటి ప్రభుత్వాన్ని నిందించారని, ఇప్పుడేమో జాతర పనులను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. అధికార పార్టీ నాయకులకు నామినేటెడ్ పద్ధతిన పనులు అప్పగించి చేతులు దులుపుకుందన్నారు. పనుల అంచనాలను భారీగా పెంచి కాంగ్రెస్ నాయకులు నిధులను జేబుల్లో నింపుకుంటున్నారన్నారు. సీసీ రోడ్లతో పాటు మట్టి రోడ్లు, బీటీ రోడ్లలో నాణ్యతా లోపం కళ్లకు కట్టినట్లు ఉందన్నారు. ఊరట్టం నుంచి కాల్వపల్లికి వెళ్లే మార్గంలో వేసిన రోడ్డు పది రోజులకే అధ్వానంగా తయారైందని తెలిపారు. మేడారం, కొండాయి, ఊరట్టం మీదుగా రూ.25 లక్షలతో చేపట్టిన పనులు నాసిరకంగా ఉన్నాయని, పస్రా నుంచి లింగాల వెళ్లే రోడ్డు మధ్యలో సుమారు పది కిలోమీటర్ల మేర పనులు చేయకుండా వదిలి వేసిన కాంట్రాక్టర్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు మేల్కొని పనుల్లో వేగం పెంచి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆమె వెంట తాడ్వాయి ఎంపీపీ గొంది వాణిశ్రీ, మేడారం సర్పంచ్ చీడెం బాబురావు, ఊరట్టం సర్పంచ్ గొంది శ్రీధర్, మాజీ జడ్పీటీసీ ఆర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎస్ వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డీ మల్లయ్య ఉన్నారు.

### జాతీయ స్థాయి టోర్నమెంట్ రెఫరీగా కుమారస్వామి

ఏటూరునాగారం, జనవరి 24 : బీహార్ రాష్ట్రం సరేన్ నగరంలో ఈనెల 27 నుంచి 31 వరకు నిర్వహించే 45వ జాతీయ స్థాయి జూనియర్ బాలికల హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌కు రాష్ట్రం నుంచి మండల కేంద్రానికి చెందిన పర్వతాల కుమారస్వామి రెఫరీగా వ్యవహరించనున్నట్లు టోర్నమెంట్ జాయింట్ సెక్రటరీ, తెలంగాణ జనరల్ సెక్రటరీ శ్యామల పవన్ తెలిపారు. గత నెలలో మంచిర్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌కు కుమారస్వామి వరంగల్ జట్టుకు కోచ్‌గా వెళ్లారు.

**PUBLIC NOTICE**

Under the intructions of my client M/s. Shriram Finance Limited Parkal Branch. I issue the following notice to general public. My client intends to grant Loan to Rahena W/o Mohammad Hareea Resident of H.No. 18-7, Rajeev Nagar, Bhupalpally by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if any one have any claims changes, Mortgages, Sale Agree-ments, Court Attachments, Court Disputes etc., shall be informed to the address mentioned below in writing within 5 Days from the date of this notice. Other wise later objections will not bind my client in this regard.

**SCHEDULE OF THE PROPERTY**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మండలం భూపాలపల్లి నగర పంచాయతి భూపాలపల్లి, మండల పరిషత్ భూపాలపల్లి, జిల్లా పరిషత్ వరంగల్ రిజిస్ట్రేషన్ జిల్లా వరంగల్ ఉప జిల్లా పరకాల ఏరియాకు చెందిన మా.జె. భూపాలపల్లి గ్రామ శివారులోని వార్డ్ నెం. 18, ఇ.నెం. 18-7 గల రెండు ఎ.సి.సి. రేకుల ఇల్లు (6 రూములు) మరియు ఇంటికి సంబంధించిన ఖాళీస్థల విస్తీర్ణం: 174 చ.గ.లు లేక 145.48 చ.మీ.లు కట్టుబడి విస్తీర్ణం 720 చ.ఫీ.లు గల దానికి హద్దులు: ఉత్తరం: పొత్తుల దారి, దక్షిణం: మేకల దుర్గయ్య గారి ఇల్లు, తూర్పు: నగర పంచాయతి రోడ్, పడమర: మంజూర్ గారి ఇల్లు.

Sd/- NALLELLA SURENDER, NALLELLA SUHAS
ADVOCATES,
H.No. 1-8-489, Haritha Residency, Balasamudram, HANAMKONDA, Warangal. Cell: 9849365117

### ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు

భూపాలపల్లి రూరల్, జనవరి 24 : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని భరోసా కేంద్రంలో సర్వీస్ రెగ్యులరైజేషన్ హక్కులు లేకుండా సంవత్సరం కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేసేందుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిలర్ ఉద్యోగానికి ఎంఎస్సీ సైకాలజీ, ఎంఎస్‌డబ్ల్యూ, సపోర్ట్ పర్సన్ ఆఫీసర్‌కు ఎంఎస్‌డబ్ల్యూ, చైల్డ్ డెవలప్‌మెంట్, లీగల్ సపోర్ట్ పర్సన్ ఆఫీసర్‌కు ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, రిసెప్షనిస్టుకు డిగ్రీ, కంప్యూటర్ లిటరేట్, మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్‌కు బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు https://womensafetywing.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఎస్పీ కోరారు.

**PUBLIC NOTICE**

Under the intructions of my client M/s. Shriram Finance Limited Mulugu Branch. I issue the following notice to general public. My client intends to grant Loan to Nuneti Sambaiah S/o Komraiah Resident of Jaggannapet, Mulugu by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if any one have any claims changes, Mortgages, Sale Agree-ments, Court Attachments, Court Disputes etc., shall be informed to the address mentioned below in writing within 5 Days from the date of this notice. Other wise later objections will not bind my client in this regard.

**SCHEDULE OF THE PROPERTY**

Open land admeasuring to an extent of 169.34 Sy.yds or 141.59 Sq.mts in Sy.No. 1189 situated at Mulugu village and mandal of Mulugu District, within the limits of Grampanchayath Mulugu Village and Sub Registrar Mulugu is bounded by East: Open place Sold to Bairaboina Manjula West: Plot of Akula Rajamouli, North: 20fts Road, South: Plot of Sakinala Shobhan.

Sd/- NALLELLA SURENDER, NALLELLA SUHAS
ADVOCATES,
H.No. 1-8-489, Haritha Residency, Balasamudram, HANAMKONDA, Warangal. Cell: 9849365117

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**HOSTEL FOR SALE**

★సుబేదారి నందు గల గర్ల్స్ హాస్టల్ ఫర్నిచర్‌తోని అమ్మబడును. హాస్టల్లో ఉండి వంటచేయుటకు వంట మనిషి కావలెను. (లేడీస్). సెల్: 8328620934
NTW-000

**CHANGE OF NAME**

★I, SWAPANASSREE YELLENKI, R/o. H.No. 3-339, Main Road, Parkal, Warangal-Hanumakonda-506 164, TS. Changed My Name as YERRA SWAPNA SRI.
NT-319345

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**సెప్టిక్ ట్యాంక్ క్లీనర్**

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-323107*9

**PLOT FOR SALE**



★బీబీ నగర్ AIIMS హాస్పిటల్ దగ్గర్లో HMDA Open Plots తక్కువ ధరలో కలవు. RERA అప్రూవ్డ్ & Bank లోన్ 60% కలదు. సంప్ర: 6309771255
NT-320381

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

| HANAMKONDA | WARANAGAL |
|---|---|
| 9182777563 | 9182777556 |
| 9182777618 | 9182777557 |
| 9182777213 | 9182777558 |

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

# పాతాళానికి భూగర్భ జలాలు

- భూపాలపల్లి జిల్లాలో 0.50 మీటర్ల లోతులో నీరు
- భారీగా పడిపోయిన భూగర్భ జలాలు
- వేసవిలో పరిస్థితి తీవ్రతరం
- స్పష్టంగా కనిపిస్తున్న బొగ్గు గనుల ఎఫెక్ట్

జయశంకర్ భూపాలపల్లి, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : భూపాలపల్లి జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. వేసవికి ముందే జలం పాతాళానికి పడిపోతుండడం ప్రజలు, రైతులను కలవరపెడుతున్నది. యాసంగి పంటలతో పాటు తాగునీటికి తిప్పలు తప్పేలా లేవు. ప్రస్తుతం ఆవరేజ్‌గా 0.50 మీటర్ల లోతుల్లోకి భూగర్భ నీటి మట్టం పడిపోయింది. భూపాలపల్లి, మల్హర్ మండలాల్లో భారీగా అడుగంటి పోయాయి. ఆ తరువాత స్థానంలో గణపురం, మొగుళ్లపల్లి మండలాలు చేరాయి. గత డిసెంబర్, గడిచిన డిసెంబర్‌తో పోలిస్తే 0.50 లోతుల్లోకి నీటి మట్టం పడిపోయింది. భూపాలపల్లి, గణపురం, మల్హర్ మండలాల్లో బొగ్గు గనుల ఎఫెక్టు కనిపిస్తున్నది. ఇక్కడ జలం రోజు రోజు కూ హరించుకుపోతున్నది. యాసంగిలో భారీగా పంటల అంచనాలను రూపొందించుకున్న వ్యవసాయశాఖ ఇప్పుడు వాటిని మార్చుకునే పరిస్థితి వచ్చింది. ఎండలు ముదిరితే నీటి కష్టాలు ఎక్కువ అవుతాయని భూగర్భ జలశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

**భూగర్భ జలాల నీటి మట్టాలు (మీటర్లలో)**

| మండలం | డిసెంబర్–2022 | డిసెంబర్–2023 |
|---|---|---|
| భూపాలపల్లి | 3.08 | 5.85 |
| చిట్యాల | 3.86 | 3.34 |
| గణపురం | 3.80 | 5.72 |
| కాటారం | 18.15 | 16.59 |
| మహాముత్తారం | 2.54 | 3.46 |
| మహదేవపూర్ | 10.68 | 10.83 |
| మల్హర్ | 4.03 | 6.77 |
| మొగుళ్లపల్లి | 4.90 | 3.71 |
| పలిమెల | 6.95 | 7.01 |
| రేగొండ | 3.57 | 3.91 |
| టేకుమట్ల | 3.83 | 3.65 |
| **ఆవరేజ్** | **5.94** | **6.44** |

**పొంచి ఉన్న నీటి ఇబ్బందులు**

భూగర్భ జల శాఖ అధికారులు ప్యూజోమీటర్ ఆధారంగా విడుదల చేసిన నివేదికలు చూస్తే రానున్న రోజుల్లో నీటి ఇబ్బందులు తప్పేటట్లు లేవు. గత (2022) డిసెంబర్‌లో 5.94 మీటర్ల లోతులో ఉన్న నీటి మట్టం ఈ డిసెంబర్ (2023)లో 6.44 మీటర్లకు పడి పోయింది. భూపాలపల్లి మండలంలో గత డిసెంబర్‌లో 3.08 మీటర్ల లోతులో ఉన్న జలం ఈ డిసెంబర్‌లో 5.85 మీటర్లకు, మల్హర్ మండలంలో గత డిసెంబర్‌లో 4.03 మీట ర్లు ఉండ గా ఈ డిసెంబర్‌లో 6.77 మీటర్లకు అడుగంటింది. గణపురం మండలంలోనూ 3.80 మీటర్ల లోతులో ఉన్న నీటి మట్టం ఇప్పుడు 5.72 మీటర్ల లోతుకు చేరింది. ఈ మూడు మండలాల్లోనూ బొగ్గు వెలికితీత కార్యకలాపాలు కొనసాగడం వల్ల ఎక్కువగా జలాలు అడుగంటినట్లు తెలుస్తున్నది.

**సేద్యంపై తీవ్ర ప్రభావం**

కాళేశ్వరం ప్రాజెక్టుతో గత ఏడాది చెరువులు, కుంటలు నిండగా బోర్లు, బావుల్లో భూగర్భ జల మట్టాలు పెరిగాయి. పంటల విస్తీర్ణం సైతం పెరిగింది. ప్రస్తు తం ప్రాజెక్టు అందుబాటులో లేకపోవడం, బోర్లు, బావుల్లో నీటి మట్టాలు తగ్గడం సాగుపై ప్రభావం చూపుతుంది. గత యాసంగిలో జిల్లాలో 1,05,625 ఎకరాల విస్తీర్ణంలో సాగు జరుగగా ఈ యాసంగిలో 1,13,452 ఎకరాల్లో సాగు జరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేశారు. ఈ యాసంగిలో లక్ష ఎకరాల్లో వరి సాగవుతుందని అంచనా వేసినా 85 వేల ఎకరాల్లోనే సాగయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 30 వేల ఎకరాల్లో వరి నాట్లు పడ్డాయి. రైతుబంధు పూర్తి స్థాయిలో అందకపోవడం, పంటలకు నీరు సక్రమంగా అందే అవకాశం లేకపోవడంతో రైతులు డైలమాలో పడుతున్నారు.

## పకడ్బందీగా భద్రతా చర్యలు

- ములుగు ఎస్పీ శబరీష్ • మేడారంలో భద్రతా ఏర్పాట్ల పరిశీలన

తాడ్వాయి, జనవరి 24: అమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీగా భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ శబరీష్ అన్నారు. బుధవారం ఆయన పోలీస్ అధికారులతో కలిసి జాతర పరిసరాలను పరిశీలించారు. మొదటగా గద్దెల ఆవరణలోని మంచెపైకి ఎక్కి భక్తులు దర్శనానికి వచ్చి పోయే మార్గాలను చూశారు. అనంతరం పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించి సౌకర్యాలపై ఆరా తీశారు. వాహనాలు సులువుగా పార్కింగ్ ఏర్పాట్లు చేయడం ద్వారా ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కావన్నారు. గద్దెల వద్ద రద్దీ ఉండకుండా భక్తులు త్వరగా దర్శనం చేసుకొని వెళ్లేలా ఏర్పాట్లు చేశామన్నారు. పూజారులకు ఇబ్బందులు కలుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఎస్పీ వెంట సీఐ శంకర్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

## ఏడాదిలోగా 'రెడ్‌క్రాస్' భవన నిర్మాణం పూర్తి

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కృష్ణకాలనీ, జనవరి 24 : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భవన నిర్మాణాన్ని ఏడాదిలోగా పూర్తి చేస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో రెడ్‌క్రాస్ భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు కాశీంపల్లి పెద్దమ్మతల్లి ఆలయానికి రూ. 6.70 లక్షలతో ప్రహరీ నిర్మాణం, లైటింగ్ ఏర్పాటు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీలో ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణరావు

**ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం**

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని ఎమ్మెల్యే సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి నుంచి భద్రాచలం, మేడారం జాతరకు భక్తులు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన రెండు ఆర్టీసీ బస్సులను బుధవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, కౌన్సిలర్లు ఎం తిరుపతి, దాట్ల శ్రీనివాస్, ఎం రవీందర్ గౌడ్, డీఎం లక్ష్మీ నారాయణ, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, సభ్యులు డాక్టర్ కిరణ్, బిల్లా రాజిరెడ్డి, మూర్తి, కృష్ణమోహన్, తూటి దేవేందర్, నాయకులు కే సాంబమూర్తి, వెంకటేశ్వర్లు, రాముడు పాల్గొన్నారు.

**అర్హులందరికీ సదరం సర్టిఫికెట్లు**

భూపాలపల్లి రూరల్ : అర్హులైన దివ్యాంగులందరికీ సదరం సర్టిఫికెట్లు అందజేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు వైద్యాధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని వంద పడకల దవాఖానలో ఎముకలు (ఆర్థోపెడిక్), చెవిటి, మూగ (ఈఎన్‌టీ) వైకల్యం ఉన్న వారికి బుధవారం నిర్వహించిన సదరం క్యాంపును ఆయన సందర్శించారు. కార్యక్రమంలో డీఆర్డీవో పురుషోత్తం, ఆస్పత్రి సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, డాక్టర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### డ్రైవర్ లేనిదే.. రవాణా లేదు : డీఎం

కృష్ణకాలనీ, జనవరి 24 : డ్రైవర్ లేనిదే.. రవాణా లేదని భూపాలపల్లి ఆర్టీసీ డీఎం లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో నిర్వహించిన అంతర్జాతీయ డ్రైవర్ల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా, వస్తు రవాణాలో డ్రైవర్ల ప్రాముఖ్యత ఎనలేనిదన్నారు. ప్రయాణికులు, వస్తువులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా రవాణా చేస్తున్న డ్రైవర్లు అభినందనీయులన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డ్రైవర్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

### కేటీకే ఓసీ-3ని సందర్శించిన అధికారులు

గణపురం, జనవరి 24 : మండలంలోని కేటీకే ఓసీ–3 గని, పరిసర ప్రాంతాలను బుధవారం సింగరేణి భద్రతాధికారుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా యాజమాన్య లక్ష్యాల సాధనలో భాగంగా గని అధికారులు చేపడుతున్న చర్యలను వారు అడిగి తెలుసుకున్నారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతపై దృష్టి సారించాలన్నారు. వారి వెంట మార్కెటింగ్ జీఎం దేవేందర్, డీజీఎం శ్రీనివాస్, నాణ్యత డీజీఎం కవీంద్ర, మేనేజర్లు భానుప్రసాద్, శ్రీనివాస్ ఉన్నారు.

### బాధితురాలికి అండగా ఎస్సై

వెంకటాపూర్, జనవరి 24 : అన్న చేతిలో గాయపడి చికిత్స పొందుతున్న మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన సారక్కను స్థానిక ఎస్సై చల్లా రాజు పరామర్శించారు. బుధవారం ఆరెపల్లిలోని ప్రైవేట్ దవాఖానకు వచ్చిన ఆయన సారక్క ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని మెరుగైన వైద్యం కోసం యాజమాన్యంతో ప్రత్యేకంగా మాట్లాడడంతో ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేశారు. అలాగే బాధిత కుటుంబ సభ్యులకు భరోసా కల్పించి ఆర్థిక సాయం అందించారు. సంఘటన జరిగిన 20 నిమిషాల్లోనే చేరుకొని బాధితురాలని దవాఖానకు పంపించి, నిందితులు పొన్నం సమ్మయ్య, పొన్నం ఇందిరను అదుపులోకి తీసుకోవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### భక్తులు చెత్త కుండీలను వాడాలి

ములుగురూరల్, జనవరి 24 : మేడారం జాతరకు వచ్చే భక్తులు విడిది చేసే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెత్త కుండీలను వాడాలని ములుగు ఎఫ్ఆర్వో డోలి శంకర్ అన్నారు. బుధవారం ఇంచర్ల గ్రామ శివారు ఎర్రిగట్టమ్మ వద్ద ఫారెస్టు సిబ్బందితో కలిసి ఆయన భక్తులు విడిది చేసి వదిలి వెళ్లిన వ్యర్థాలు, చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎఫ్‌వో ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. మొత్తం 200 కేజీల చెత్తను తాము సేకరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీవో జోగేందర్, ములుగు రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.

### అభివృద్ధి పనుల్లో పురోగతి సాధించాలి

మంగపేట, జనవరి 24 : అభివృద్ధి పనుల్లో పురోగతి సాధించాలని మండల ప్రత్యేకాధికారి తుల రవి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండలంలో ఈ ఏడాది చేపట్టే పనులు, పురోగతిపై సమీక్ష నిర్వహించారు. పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీడీ వెంకటనారాయణ, ఎంపీడీవో సుదర్శన్,ఎంపీవో మమత పాల్గొన్నారు.

### అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

ములుగు అదనపు కలెక్టర్ శ్రీజ

ములుగు, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : జిల్లా అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించాలని అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. బుధవారం జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించగా అదనపు కలెక్టర్ హాజరయ్యారు. తొలిసారి సమావేశాలకు హాజరైన ఆమెను జడ్పీ పాలకవర్గం సత్కరించి శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ములుగును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించడంతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సమావేశంలో ములుగు ఎంపీపీ గండ్రకోట శ్రీదేవీ సుధీర్‌యాదవ్, తాడ్వాయి ఎంపీపీ వాణిశ్రీ, జడ్పీటీసీలు పాయం రమణ, పుష్పలత, గాంధీ, జడ్పీ సీఈవో ప్రసూనారాణి, జడ్పీ కో ఆప్షన్ సభ్యులు వలియాబీ, రియాజ్‌మిర్జా, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

### ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరి మృతి

గణపురం, జనవరి 24 : ద్విచక్ర వాహనం అదుపు తప్పి మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన మామిడి పవన్ (34) మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన పవన్ ఓసీ–3లో డోజర్ డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్న క్రమంలో మార్గమధ్యంలో వాహనం అదుపుతప్పి గుంతలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. సమీపంలోని వారు వెంటనే పవన్‌ను భూపాలపల్లి జిల్లా ప్రధాన ఆసుపత్రికి, అక్కడి నుంచి ఎంజీఎం దవాఖానకు తరలించి చికిత్స అందిస్తుండగా బుధవారం మృతి చెందాడు. మృతుడి మామ పాశం సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు.

### ముగ్గురు గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

రేగొండ, జనవరి 24 : ముగ్గురు గంజాయి స్మగ్లర్లను బుధవారం అరెస్ట్ చేసి వారి నుంచి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీసీఎస్ సీఐ పులి వెంకట్, రేగొండ ఎస్సై ఎన్ రవికిరణ్ తెలిపారు. వారి కథనం ప్రకారం భద్రాదికొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలానికి చెందిన పడియం రమేశ్, సాయి, కణతి రాము మండలంలో గంజాయి కొనుక్కొని వస్తున్నారనే సమాచారం మేరకు తిరుమలగిరి ఆర్చి వద్ద మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీసీఎస్ సీఐ, ఎస్సై తెలిపారు.

### గిరిజన మత్స్యకారులకు నైపుణ్యతా పరీక్ష

మంగపేట, జనవరి 24 : పెసా చట్టం ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతంలో చేపలు పట్టుకునే అవకాశం గిరిజనులకు మాత్రమే ఉందని జిల్లా మత్స్యశాఖ అధికారి పిల్లి శ్రీపతి, పెసా కో ఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ అన్నారు. మండలంలోని మల్లూరు చెరువులో గిరిజన మత్స్య పారిశ్రామిక సహకారం సంఘం ఏర్పాటుకు నైపుణ్యతా పరీక్ష బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో పెసా కమిటీ సభ్యుడు ముసలయ్య, అమిలిచంద్రం, కల్తి మధు, గొంది నారాయణ, కోరెం నారాయణ, యాలం కాంతారావు, మారబోయిన గోవర్దన్, నల్లబోయిన లక్ష్మణ్, తోలెం శ్రీనివాస్, కొమురం నర్సింహాస్వామి పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో జాతీయ బాలికల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. బాలురతో సమానంగా ఆడపిల్లలను చూడాలని పలువురు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా భూపాలపల్లి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జంగేడు కేజీబీవీలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి పాల్గొన్నారు. ములుగు జిల్లా జాకారం సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వరంగల్ రీజినల్ కోఆర్డినేటర్ ఎస్ విద్యారాణి హాజరు కాగా వైద్యులు మల్లికార్జున్, శ్రీలత, ఆంజనేయులు పరీక్షలు చేసి పౌష్టికాహారంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సుచరిత పాల్గొన్నారు. వాజేడు మండల కేంద్రంలోని కేజీబీవీని జీసీడీవో జీ రమాదేవి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వెంకటాపూర్ మండలంలోని జవహర్‌నగర్ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. మంగపేట మండలం తిమ్మంపేట ఉన్నత పాఠశాలలో 'బాలికను రక్షిద్దాం, బాలికను చదివిద్దాం' అంశంపై చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ నరేశ్ అవగాహన కల్పించారు. కాటారం మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

విద్యార్థులను సన్మానిస్తున్న జడ్జి జయరాంరెడ్డి

### పనుల్లో వేగం పెంచాలి : ఐటీడీఏ పీవో

తాడ్వాయి, జనవరి24 : జాతరలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఐటీడీఏ పీవో అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన పలు పనులను పరిశీలించారు. మొదటగా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన తాత్కాలిక మరుగుదొడ్లను పరిశీలించి ఎప్పటి వరకు పూర్తి చేస్తారని తెలుసుకున్నారు. నీటి నిల్వతో పాటు స్కావెంజర్లను ఏర్పాలు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఐటీడీఏ గెస్ట్‌హౌస్ మరమ్మతుల పనులను పరిశీలించి రెండు రోజులలో పూర్తి చేయాలన్నారు. జంపన్నవాగులోని ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల్లో పూడికతీత పనులు, ట్యాప్స్ బిగింపు పనులు, చాటు గదులను పరిశీలించారు. క్రాస్ బండ్‌ల ఏర్పాటు ఇసుక తొలిగింపు పనులు నెలాకరు నాటికి చేయాలని ఆదేశించారు. అక్కడి నుంచి మ్యూజియం చేరుకుని పెయింటింగ్ పనులు, క్లీనింగ్, పక్కనే జరుగుతున్న మీటింగ్ హాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. మండలకేంద్రంలో కిచెన్ షెడ్డును పరిశీలించి ఈనెల 27లోపు పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పీవో పీఓ వసంతరావు, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

### పనులు సకాలంలో పూర్తి చేయాలి

తాడ్వాయి, జనవరి 24 : మేడారం జాతరలో భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న పనులు సకాలంలో పూర్తి చేయాలని దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ అన్నారు. ఆ శాఖ ఆధ్వర్యంలో రూ.7.90 కోట్లతో చేపట్టిన కిచెన్ షెడ్డు, పూజారుల అతిథి గృహం, అమ్మవార్లను తీసుకువచ్చే క్రమంలో పూజలు నిర్వహించే మందిరాల పనులు, అమ్మవార్ల గద్దెల చుట్టూ గ్రిల్స్ పనులను పరిశీలించారు. పనుల పురోగతిని ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను అడిగితెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహా జాతర సమీపిస్తున్నదని, భక్తుల రద్దీ అధికమవుతున్నందున గడువు లోగా పలు పూర్తి చేయాలన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. సమావేశంలో జాతర ఈవో అధికారి రాజేంద్రం, డీఈ రమేశ్‌బాబు పాల్గొన్నారు.

**జంట వంతెనలకు రెయిలింగ్ ఏర్పాటు**

మేడారంలోని జంట వంతెనలకు ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు రెయిలింగ్ ఏర్పాటు చేస్తున్నారు. వంతెనల మీద భక్తుల రద్దీ ఉండనున్నందున ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ఇనుప రాడ్‌లతో రెయిలింగ్ ఏర్పాటు చేస్తున్నారు.

### గ్రామాల అభివృద్ధే లక్ష్యం

గోవిందరావుపేట, జనవరి 24 : మారుమూల గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు. మండలంలోని పస్రాలో బుధవారం సాయంత్రం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు రోడ్డు పనులు ప్రారంభించినట్లు ఆయన చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అంతర్గత రోడ్లకు రూ.2.50 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఎల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

### స్వచ్ఛ మేడారమే లక్ష్యం

గోవిందరావుపేట, జనవరి 24 : జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛ్ భారత్.. స్వచ్ఛ మేడారం కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు శ్రమదానం చేశారు. వైల్డ్ లైఫ్ రేంజ్ అధికారి శిరీష, అటవీ రేంజ్ అధికారి మాధవీ శీతల్ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ రహదారి, చల్వాయి, లక్నవరం రహదారులకు ఇరువైపులా ఉన్న ప్లాస్టిక్, చెత్తను సేకరించారు. కార్యక్రమాల్లో డిప్యూటీ రేంజ్ అధికారి శోభన్, ఎఫ్ఎస్‌వోలు వేణుగోపాల్, సుజాత, బీట్ ఆఫీసర్ దీప్‌లాల్, సెక్షన్ అధికారులు సందీప్, నర్సయ్య, శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

### దేవాదుల వద్ద మూడో మోటర్ ఆన్

కన్నాయిగూడెం, జనవరి 24 : మండలంలోని దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులోని రెండు మోటర్ల ద్వారా గోదావరి నీటి పంపింగ్ కొనసాగుతుండగా బుధవారం మరో మోటర్ ఆన్ చేశారు. మూడు మోటర్ల ద్వారా రోజుకు 1,114 క్యూసెక్కుల నీటిని భీంఘనపురం రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 6,535 టీఎంసీల నీటిని పంపింగ్ చేసినట్లు డీఈ శరత్ తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న భూపాలపల్లి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

### పరిపాలన వికేంద్రీకరణతో మెరుగైన ఫలితాలు

భూపాలపల్లి రూరల్, జనవరి 24 : పరిపాలన వికేంద్రీకరణ ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు జిల్లాలోని విద్య, వైద్య, అంగన్‌వాడీ కేంద్రాలను తరచుగా తనిఖీ చేయాలని ఆదేశించారు. జిల్లాలో 644 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయని, వీటికి కుర్చీలు, గుడ్లు పెట్టుకునేందుకు ర్యాకులు అందజేసినట్లు తెలిపారు. సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సమర్పిస్తే నిధులు మంజూరు చేస్తామన్నారు. దేశంలోనే రేగొండ, గణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంచి పేరు సాధించాయని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మండలాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

**సింగరేణి ఉత్తమ ఉద్యోగులు వీరే..**

భూపాలపల్లి రూరల్, జనవరి 24 : గణతంత్ర దినోత్సవం సందర్భంగా భూపాలపల్లి సింగరేణి ఏరియాలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఉత్తమ ఉద్యోగులను బుధవారం ప్రకటించారు. కావటి రమేశ్, సర్వేయర్ (కేటీకే ఓసీ–3), టీ వెంకటరామరెడ్డి (కేటీకే ఓసీ–2 పీవో), కేటీకే–1 ఇంక్లైన్‌లో పని చేస్తున్న మహ్మద్ రాజ్ మహ్మద్ (హెచ్‌వోఎం), కాసర్ల శ్రీనివాస్ (జనరల్ మజ్దూర్), కేటీకే–5 ఇంక్లైన్‌లో పని చేస్తున్న ఈర రవీందర్ (హెచ్‌వోఎం), బీ కొమురయ్య (టెండాల్), కేటీకే–6 ఇంక్లైన్‌లో పని చేస్తున్న వద్దపల్లి భూమయ్య (ట్రామర్), మోతుకూరి బాలయ్య (ఫిట్టర్ హెల్పర్), కేటీకే ఓసీ–3 (యుజీ)లో పని చేస్తున్న గుగులోత్ రాజూ నాయక్ (ఫోర్‌మెన్), పూరెళ్ల శ్రీనివాస్ (ఎస్‌డీఎల్ ఆపరేటర్), కేటీకే ఓసీ–2లో పని చేస్తున్న గోపతి లచ్చులు (హెచ్‌వోఎం), జీ కుమారస్వామి (ఏసీఎం), కేటీకే ఓసీ–3లో పని చేస్తున్న సోల్లేటి కృష్ణారెడ్డి (జనరల్ మజ్దూర్), బాల్లేని మహేందర్‌రావు (ఫిట్టర్)ను ఎంపికైనట్లు ఏరియా అధికార ప్రతినిధి అజ్మీరా తుకారాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న కావటి రమేశ్, టీ వెంకటరామరెడ్డిని కొత్తగూడెంలో సీఎండీ బలరాంనాయక్, మిగతా ఉద్యోగులను భూపాలపల్లి జీఎం బళ్లారి శ్రీనివాసరావు సన్మానిస్తారని ఆయన తెలిపారు.